నమస్తే తెలంగాణ | DISTRICT SUPPLEMENT

# వికారాబాద్

బుధవారం 13 డిసెంబర్ 2023
WEDNESDAY, DECEMBER 13, 2023 | VIKARABAD | పేజీలు : 8 PAGES




రాచకొండ పోలీస్ కమిషనరేట్

## కమిషనరేట్లకు.. కొత్త బాస్‌లు

- సిన్సియర్ అధికారులుగా గుర్తింపు
- సంచలనాత్మక కేసులను ఛేదించి దేశవ్యాప్త గుర్తింపు

7


సుధీర్‌బాబు


అవినాష్ మహంతి

### ఎవరికి వారే ప్రత్యేకం

### చట్టాన్ని అతిక్రమిస్తే సింహ స్వప్నమే !

రాచకొండ, సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్లకు మంగళవారం కొత్త బాస్‌లను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సైబరాబాద్ పోలీస్ కమిషనర్‌గా అవినాష్ మహంతి, రాచకొండ పోలీస్ కమిషనర్‌గా జీ సుధీర్‌బాబులను నియమించింది. విధి నిర్వహణలో సిన్సియర్ అధికారులుగా వీరికి ప్రత్యేక గుర్తింపు ఉన్నది. ప్రస్తుతం సైబరాబాద్ జాయింట్ సీపీ(అడ్మిన్)గా పని చేస్తున్న అవినాష్ మహంతికి చట్టానికి లోబడి, ముక్కుసూటిగా పని చేస్తూ ప్రజలకు సేవలందిస్తారన్న పేరున్నది. ప్రభుత్వ భూముల కబ్జాలు, మట్టి కుంభకోణం, చీటింగ్, సైబర్ కేసులు, దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తూ అమాయక ప్రజలను పట్టి పీడించిన కలర్ ప్రిడిక్షన్, లోన్ యాప్ వంటి కేసులను ఛేదించారు. ఆయన సేవలను గుర్తించిన ప్రభుత్వం సైబరాబాద్ సీపీగా నియమించింది. హైదరాబాద్ ట్రాఫిక్ అదనపు సీపీగా కొనసాగుతున్న జి.సుధీర్‌బాబుకు హైదరాబాద్‌తో పాటు రాచకొండ కమిషనరేట్‌పై గట్టి పట్టున్నది. మహబూబ్‌నగర్ ఎస్పీగా, టాస్క్‌ఫోర్స్, అల్వాల్, శంషాబాద్ డీసీపీగా, వరంగల్ సీపీగా పని చేశారు. రాచకొండ జాయింట్ సీపీగా పని చేసిన ఆయన ఐజీగా పదోన్నతి పొందిన తరువాత హైదరాబాద్ ట్రాఫిక్ అదనపు సీపీగా బాధ్యతలు చేపట్టారు. ఎక్కడ పనిచేసినా తనకంటూ ఒక ముద్ర వేసుకుంటారు. రాచకొండలో జాయింట్ సీపీగా పని చేసిన అనుభవం ఉండడంతో ప్రభుత్వం రాచకొండ పోలీస్ కమిషనర్‌గా నియమించింది. సిబ్బందికి దిశా నిర్దేశం చేసి, ప్రజలకు పారదర్శక సేవలు అందించేలా చేయడంతో పాటు చట్టాన్ని అతిక్రమించే వారికి సింహ స్వప్నంలా ఉంటారని కొత్త బాస్‌లకు పేరున్నది.

– సిటీబ్యూరో, డిసెంబర్ 12 (నమస్తే తెలంగాణ)

7

## తగ్గిన ఉపాధి

- రెండేళ్లలో తగ్గిన 40 లక్షల పని దినాలు
- కేంద్రప్రభుత్వ నిర్ణయాలతో ప్రతీ ఏడాది తగ్గుతున్న ఉపాధి
- ఈ ఆర్థిక సంవత్సరం 63.87 లక్షల పనిదినాలను కల్పించడమే లక్ష్యం
- ఇప్పటివరకు 47.91 లక్షల పని దినాలు పూర్తి
- 1685 కుటుంబాలకు మాత్రమే వంద రోజుల పని కల్పన
- జిల్లాలో 95,985 జాబ్ కార్డులుండగా...1,68,689 మంది ఉపాధి హామీ కూలీలు

ఉపాధి హామీ పథకానికి కేంద్ర ప్రభుత్వం తూట్లు పొడుస్తున్నది. నిరుపేదల కడుపు నింపేందుకు అమలు చేస్తున్న ఈ పథకం గత కొన్నేండ్లుగా నిర్వీర్యమవుతున్నది. ఎన్‌ఆర్‌ఈజీఎస్ సాఫ్ట్–ఎన్ఐసీ సాఫ్ట్‌వేర్, కేంద్ర బృందాల తప్పుడు రిపోర్ట్‌లతో కూలీల పొట్ట కొట్టినట్లవుతున్నది. వికారాబాద్ జిల్లాలో గడిచిన రెండేళ్లలోనే 40 లక్షల పని దినాలను తగ్గించారు. కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న విధానాల వల్ల వేలాది కుటుంబాలు 'ఉపాధి' పనులకు దూరమయ్యాయి. ఈ ఆర్థిక సంవత్సరం 63.87 లక్షల పనిదినాలను కల్పించాలని జిల్లా యంత్రాంగం లక్ష్యంగా పెట్టుకోగా, ఇప్పటి వరకు 47.91 లక్షల పనిదినాలను మాత్రమే కల్పించారు. ఆర్థిక సంవత్సరం ముగిసేందుకు మరో మూడు నెలలే గడువున్నా ఇప్పటి వరకు కేవలం 1,685 కుటుంబాలకు మాత్రమే వంద రోజుల పనిని కల్పించగలిగారు. ప్రస్తుతం హరితహారం, నర్సరీలు, భూ అభివృద్ధి పనులు, పంట కాల్వలను తవ్వడం వంటి పనులు సాగుతుండగా, రోజుకు 3,600 మంది కూలీలే పనులకు హాజరవుతున్నారు. జిల్లాలో 95,985 జాబ్ కార్డులుండగా, 1,68,689 మంది ఉపాధి హామీ కూలీలు ఉన్నారు.

– వికారాబాద్, డిసెంబర్ 12 (నమస్తే తెలంగాణ)



## యాసంగికి సిద్ధం

### కూరగాయల సాగుకు రంగారెడ్డి జిల్లా ఉద్యానవన శాఖ ప్రణాళిక

- 9,195 ఎకరాల్లో కూరగాయల పంటలు సాగయ్యేలా చర్యలు
- హైదరాబాద్‌లోని పలు మార్కెట్లకు జిల్లా నుంచే కూరగాయల ఎగుమతి
- ప్రభుత్వ ప్రోత్సాహంతో కూరగాయలను ఎగుమతి చేసే స్థాయికి ఎదిగిన జిల్లా
- యాసంగిలో కూరగాయల సాగైతేనే మేలంటున్న అధికారులు
- జిల్లావ్యాప్తంగా ఏటా 3లక్షల మెట్రిక్ టన్నుల కూరగాయల దిగుబడి

8

కూరగాయల సాగులో రాష్ట్రంలోనే రంగారెడ్డి జిల్లా అగ్రస్థానంలో ఉన్నది. అధిక గ్రామాలు కూరగాయల పంటలను సాగు చేస్తూ హైదరాబాద్‌లోని పలు మార్కెట్లకు ఎగుమతి చేస్తున్నారు. ఈ యాసంగి సాగుకు ఉద్యానవన శాఖ ప్రణాళికను సిద్ధం చేసింది. జిల్లాలో 9,195 ఎకరాల్లో కూరగాయల సాగు చేసేలా రైతులను సన్నద్ధం చేసింది. ఉద్యాన పంటల సాగుకు రాయితీ పథకాలతో ప్రభుత్వం రైతులకు ప్రోత్సాహాన్నిస్తున్నది. వేరే పంటల సాగు కన్నా కూరగాయల సాగు మేలని అధికారులు సూచిస్తున్నారు. ఇందుకుగాను శిక్షణా కార్యక్రమాలను నిర్వహిస్తూ నూతన సాగు పద్ధతులు, సస్యరక్షణ చర్యలు, మెళకువలపై అవగాహన కల్పిస్తున్నారు. జిల్లాలో ఏటా మూడు లక్షల మెట్రిక్ టన్నుల కూరగాయల దిగుబడి అవుతున్నది.

– రంగారెడ్డి, డిసెంబర్ 12 (నమస్తే తెలంగాణ)


చేవెళ్ల మండలంలోని ధర్మసాగర్ గ్రామంలో సాగైన టమాట పంట